క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న అమ్మవారు

పగిద్యాల: మండల పరిధిలోని సంకిరేణి పల్లె గ్రామంలో సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన విశేషాది పూజలు జరిపించారు. వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రదర్శించిన పడక సీను, భవాని సీను, సత్యహరిశ్చంద్ర(వారాణాసి, కాటిసీను) ఉచిత పౌరాణిక నాటకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందిలో కోటిలింగాల ఆలయ పీఠాధిపతి


మెమొంటోతో సత్కరిస్తున్న మస్తాన్‌రావు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కోటిలింగాల ఆలయ పీఠాధిపతి శివేశ్వర స్వామిజీ మంగళవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గంగ, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు శివస్వామీజీకి స్వాగతం పలికి పూజలు మెమొంటోతో సత్కరించారు.


అలరించిన గాత్రకచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన మూర్తిలక్ష్మీశ్యామల, బృందం వారి గాత్రకచేరి అలరించింది. గణేశ పంచరత్నాలు, శంకరా చంద్రశేఖరా, శివుడు తాండవం చేయవమ్మా, హిమగిరి తనయే, భో శంభో శివ శంభో, భ్రమరాంబాతల్లికి మంగళం తదితర గీతాలను మూర్తిలక్ష్మి శ్యామల తదితరులు ఆలపించారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం అడవిలో మంగళవారం నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్, సివిల్ పోలీసులు ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తున్న ఎరుకలి సుధాకర్‌పై కేసు నమోదు చేశారు. సోదాల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శంకర్‌నాయక్, పోలీసులు శివన్న, మధుప్రసాద్, రమిజాబి పాల్గొన్నారు.

సబార్డినేట్ మృతి


వాసుదేవ్(ఫైల్)

నందికొట్కూరు: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సబార్డినేట్ సగినేల వాసుదేవ్(56) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐలు, వీఆర్వోలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమ్మె నోటీసు అందజేత

బండి ఆత్మకూరు: ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు స్వచ్ఛ భారత్ కార్మికులు మంగళవారం ఎంపీడీఓ దస్తగిరికి సమ్మె నోటీసు ఇచ్చారు. సీఐటీయూ నాయకుడు రత్నమయ్య ఆధ్వర్యంలో కార్మికులు ఎంపీడీఓను కలిసి తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నామని వివరించారు.

ఆరోగ్యం చల్ల‘కుండ’

- ఆరోగ్యానికి మేలు చేస్తున్న మట్టికుండలు
- మార్కెట్‌లో మట్టి బాటిళ్లు, కూజాలు, టీ కప్పులు
- ప్రజలను ఆకర్షిస్తున్న వినూత్న మట్టి పాత్రలు
- వేసవిలో ఊపందుకున్న మట్టికుండల వినియోగం


పాత బస్టాండ్ వద్ద లో మట్టి పాత్రలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నందికొట్కూరు: భానుడు భగభగమంటున్నాడు. వేడి నుంచి ఉపశమనం పొందడానికి జనం చల్లని పానీయాల వైపు చూస్తారు. తక్షణం ఉపశమనం పొందేందుకు రోడ్లలో ఏదో ఒక కూల్‌డ్రింక్ లేదా పండ్లరసం తాగేస్తారు. అయితే మట్టికుండ నీరు ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే. ఆధునిక జీవనశైలిలో మట్టికుండలు, పాత్రలు కనుమరుగవుతున్న పరిస్థితిని చూస్తున్నాం. కానీ ఎండా కాలం వచ్చిందంటే మట్టి కుండలకు ఆశ్రయించేవారు ఎక్కువవుతున్నారు. కష్టమర్లకు అనుగుణంగా కొందరు మట్టి కుండలు, పాత్రలను ఆకర్షణీయంగా తయారు చేసి జీవనం పొందుతున్నారు.

మట్టి బాటిళ్లు, కూజాలు

నాడు మట్టి కుండలు లేని ఇళ్లు ఉండేవి కావు. ప్రస్తుతం ఆధునిక మోజులో పడి ప్రజలు వీటికి స్వస్తి పలికారు. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. దీంతో గతంలో ఆరోగ్యాన్ని ప్రసాదించిన నాటి మట్టిపాత్రల కొనుగోలుకే జనం మొగ్గు చూపుతున్నారు. దీంతో తయారీదారులు మట్టిపాత్రలకు ఆధునిక హంగులు దిద్దుతున్నారు. కుండలతో పాటు మట్టితో తయారు చేసిన బాటిళ్లు, గ్లాసులు, కూజాలు, టీకప్పులు, పూలకుండీలను ఆకర్షణీయంగా తయారు చేసి విక్రయానికి ఉంచుతున్నారు. దీంతో జనం వీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. బాటిల్ ఆకృతిలో ఉన్న మట్టిపాత్రలు వాటి పరిమాణం అనుసరించి రూ.100 నుంచి రూ.150, కూజాలు రూ.250 నుంచి రూ.320 వరకు ధర పలుకుతున్నాయి.

మట్టిపాత్రల ప్రత్యేకత

పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టికుండలు ఆరోగ్య సమస్యలతో ధనవంతులకు ఫ్రిజ్‌గా మారుతుంది. డాక్టర్లు ఇచ్చిన సలహాల మేరకు కుండనీరు తాగడం వల్ల పలు ఉపయోగాలున్నాయని వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. కుండలు కొనుగోలు చేస్తే ఫ్రిజ్, ఫిల్టర్ రెండూ కొనుగోలు చేసినట్టే అని తెలుపుతున్నారు. నీటిలోని మలినాల్ని లాగేసి స్వచ్ఛమైన నీటిని అందించడం మట్టిపాత్రల ప్రత్యేకత. బాటిళ్లలో, కూజాల్లో పోసిన నీరు కొంత సేపటికి ఫ్రిజ్‌లో తీసిన బాటిళ్లలాగా చల్లగా మారుతున్నాయి.

వీటిపైనే బతుకుతున్నాం



మట్టిపాత్రల తయారీనే మా వృత్తి. పూర్వం నుంచి వీటిపైనే ఆధారపడి బతుకుతున్నాం. ప్రస్తుతం వేసవి కాలంలో చూపరులను ఆకర్షించే పాత్రలు చేయాలని నిర్ణంచుకుంటాం. అందులో భాగంగా కొన్ని పాత్రలు ఇక్కడే తయారు చేస్తాం. కొన్నింటిని ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి, ఇతర మండలాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మట్టి పాత్రలు వాడకం ఆరోగ్యానికి మంచిదని ప్రజలే గ్రహిస్తున్నారు.
– రాముడు, కుమ్మరివీధి
మట్టిపాత్రల తయారీదారుడు

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఆలయాలకు ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏ.కోడూరు లక్ష్మీ చెన్నకేశవ స్వామి, పార్నపల్లి ఆంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి, వీర భద్రస్వామి ఆలయాలకు ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25లోపు జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

మండలంలో భారీ వర్షం

జూపాడుబంగ్లా: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు 29.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, భాస్కరాపురం, పోతులపాడు, పారుమంచాల, తూడిచెర్ల, మండ్లెం, తంగడంచ, తర్తూరు తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో పొలాలు పదునెక్కాయన్నారు. వర్షంతో ఎండల నుంచి కాస్త ఉపశమనం లభించినట్లయిందన్నారు. కాగా జూపాడు బంగ్లా మండలంలో 29.8 మిల్లీమీటర్లు, నందికొట్కూరులో 18.2, మిడుతూరులో 6.4, పగిద్యాలలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ తెలిపారు.

గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం


మాట్లాడుతున్న అధికారులు

వెలుగోడు: సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా కో ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన ఇలియాస్‌ఖాన్‌ను సన్మానించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పలువురు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ లాలం రమేష్ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను వచ్చే సమావేశంలోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, మండల విద్యాధికారి బ్రహ్మంనాయక్, ఏఓ నరసింహారెడ్డి, ఈఓఆర్డీ మురారి, విద్యుత్ ఏఈ రవీంద్ర నాయక్, ప్రభుత్వ వైద్యాధికారి సులోచన, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పారువేట ఉత్సవం


స్వామి అమ్మవార్లను పల్లకీలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఈశ్వర స్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన పారువేట ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ పురోహితులు లాల్ బహదూర్ శాస్త్రి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు, మంగళహారతి, తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువుంచి భాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులోకి తీసుకువచ్చారు. అక్కడ పారువేట నిర్వహించారు.

నందీశ్వరుడికి విశేష పూజలు


నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

మేట్ల రిజిస్ట్రేషన్‌పై నిర్లక్ష్యధోరణి

- ఇప్పటి దాకా మేట్లకివ్వని ఎన్ఎంఎంఎస్ యాప్


తాటిపాడులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

జూపాడుబంగ్లా: ఉపాధి హామీ పథకంలో మేట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. పనులు వేగవంతం చేయటంతో పాటు ఉపాధి శ్రామికులు సక్రమంగా పనులకు హాజరవ్వటం, నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయించడం మేట్ల పని. 20 నుంచి 50 మంది ఉపాధికూలీలను గ్రూపుగా ఏర్పాటుచేసి దానికి ఓ మేట్‌ను నియమించి అతని పేరున మేట్ రిజిస్ట్రేషన్ చేయాలని రెండు మాసాల క్రితం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు 20 నుంచి 50 మంది ఉపాధిశ్రామికులకు ఓ మేట్‌చొప్పున దరఖాస్తులను స్వీకరించి అధికారులు వారి వివరాలను ఆన్‌లైన్‌చేశారు. అయితే మేట్ల వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌చేసి వారికి ఇప్పటిదాకా ఎన్ఎంఎంఎస్ యాప్‌ను సెల్‌ఫోన్లలో అప్‌లోడ్ లేదు. గ్రామాల్లో ఉపాధిపనులకు వెళ్లిన వారికి సకాలంలో హాజరుపడక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీలుండగా ప్రతి గ్రామంలో 200 నుంచి 500 చొప్పున మండలం వ్యాప్తంగా 4,307 మంది ఉపాధి కూలీలుండగా మండలం వ్యాప్తంగా 150 మంది మేట్లు ఉన్నారు. మేట్ల నుంచి డిమాండ్ తీసుకొని పనుల్లో పాల్గొనే ఉపాధికూలీల వివరాలను ఆన్‌లైన్ చేయటంతో పాటు సకాలంలో మస్టర్‌రోల్స్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లకు ఇవ్వాల్సి ఉంది. అయితే గ్రామానికి ఓ ఫీల్డ్ అసిస్టెంటు మాత్రమే ఉండటంతో వారు సకాలంలో మేట్లు ఇచ్చిన డిమాండ్‌ను ఆన్‌లైన్ చేయకపోవటంతో పాటు ఉపాధికూలీలకు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో సకాలంలో అటెండెన్స్ వేయలేకపోతుండటంతో ఉపాధికూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్‌వేయటానికి మధ్యాహ్నం 12గంటలవుతుందని అప్పటిదాకా మండే ఎండల్లో వేచిఉండాల్సి వస్తుందని ఉపాధికూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకం అధికారులు గ్రామాల్లోని మేట్లకు రిజిస్ట్రేషన్ చేసి వారికి సెల్‌ఫోన్లలో ఎన్ఎంఎంఎస్ యాప్ అప్‌లోడ్ చేసి సకాలంలో ఉపాధికూలీల హాజరు తీసుకునేలా చేయాలని ఉపాధికూలీలు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సార్బీసీ ఎస్ఈగా పురార్ధనరెడ్డి

నంద్యాల(అర్బన్): ఎస్సార్బీసీ (శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) సర్కిల్ – 1 ఎస్ఈగా పురార్ధనరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-1 ఎస్ఈగా పురార్ధనరెడ్డి బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయనకు ముందుగానే సహ ఇంజినీర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల గోడు పట్టించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని ఎన్ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని ఏడు డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ఎన్ రావు పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులను చిన్నచిన్న కారణాలతో అధికారులు వేధించడం తగదన్నారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, సిబ్బందికి రావలసిన ప్రమోషన్లు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, ఎన్‌కాష్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, మహిళా సిబ్బందికి, చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రావు, కార్యదర్శి శివరాం, కోటేశ్వరరావు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, సీసీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్ బాబు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మండ్లెం రెవెన్యూ పరిధిలో బ్రహ్మంగారిమఠం, తర్తూరు అంచె, తరిగోపుల గ్రామాల్లో ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు.

సారా విక్రేత అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో సారా విక్రేత విష్ణును మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ విష్ణు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో నిఘావేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి మోటార్ సైకిల్, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే గ్రామంలో సారా విక్రయిస్తున్న మరో ముగ్గురిని అరెస్టు చేసి, తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

వెలుగోడు: స్థానిక బస్టాండు, వేల్పనూరు–అబ్దుల్లాపురం రహదారిలో సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 12 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సీఐ వెంట ఏఎస్‌ఐ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో తర్తూరు, జూపాడుబంగ్లా-2, మండ్లెం గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్‌కేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి


బాధితుడు రామాంజనేయులు

పగిద్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులపై అదే గ్రామానికి చెందిన తెలుగు గంగన్న మంగళవారం రాత్రి దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రామాంజనేయులు గ్రామంలో అందరినీ వరుసలు పెట్టుకుని పిలిచే వాడు. అందులోభాగంగానే గంగన్నను కూడా బామర్ది వరుసతో పిలుస్తూ యంగన్న అంటూ వ్యంగ్యంగా పలకరించాడు. కోపోద్రిక్తుడైన గంగన్న.. రామాంజనేయులుపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. బాధితుడు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ చంద్రశేఖర్ గ్రామానికి చేరుకుని నిందితుని కోసం గాలించగా అతడు పరారయ్యాడు. కాగా నిందితునికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతోనే నిందితుడిని అరెస్ట్ చేయలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.


బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అంకాల పరమేశ్వరీదేవికి బోనాలు


ప్రత్యేక అలంకరణలో అంకాల పరమేశ్వరీదేవి

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని అంకాల పరమేశ్వరీదేవి అమ్మవారికి గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా పుష్కర కాల వేడుకలు పురస్కరించుకుని మహిళలు ఇళ్ల వద్ద నుంచి బోనాలు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రఘు కుమారశర్మ, శంకరయ్యశర్మల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాల పరమేశ్వరీదేవికి చేపట్టిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం నృత్యాలు అలరించాయి. సాయంత్రం అమ్మవారికి గ్రామంలో గ్రామోత్సవం చేపట్టగా భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మ్యూజియం ఏర్పాటుకు కృషి

- జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్


మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి సంబంధించిన చారిత్రక శాసనాలను, విశేషాలను, తామ్రశాసనాలను ప్రతి భక్తుడు చూసేందుకు వీలుగా మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్ అన్నారు. ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల అమలుతీరును, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిర్వహణలో అమలవుతున్న సంక్షేమ పథకాల తీరుపై ఆయన మంగళవారం దేవస్థాన కార్యాలయంలోని సమీక్షా సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన దేవస్థానంలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతులలో అమలు పరుస్తున్న రిజర్వేషన్ విధానాన్ని పరిశీలించారు. దేవస్థానంలోని ఉద్యోగుల వివరాలను కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు ఎస్సీ కమిషన్ కార్యదర్శికి వివరించారు. అనంతరం అటెండర్ల నుంచి రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన జేవీ నరసింహులు, ఇ.మధుసూదన్, బి.చిన్న, సీహెచ్ విమల, వై.జ్యోతి, కె.రాధమ్మలకు పదోన్నతి పత్రాలు అందజేశారు. శ్రీశైలంలో దళితులకు జీవనోపాధి కోసం దుకాణాలు కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని దళిత సంఘాల నాయకులు ఆనంద్, వై.ఆశీర్వాదం, దారి వేముల శ్రీనివాస్, ఇషాక్, మయూరి, చంటి తదితరులు వినతి పత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.నాగజ్యోతి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యం.చింతామణి తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులు

పని చేసినా పస్తులే!

- మహానంది దేవస్థానంలో పని చేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులకు మూడు నెలలుగా అందని వేతనాలు
- పట్టించుకోని అధికారులు

మహానంది: వారంతా చిరుద్యోగులు.. నెల మొత్తం పనిచేయాలి.. వచ్చిన జీతంతో కుటుంబాలను పోషించుకోవాలి. కానీ ఇప్పటికి మూడు నెలలవుతున్నా వేతనాలు అందలేదు. దీంతో కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేపో మాపో వేతనాలు అందకపోతాయా అనే ఆశతో ఎదురు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. మహానంది ఆలయంలోని ఏజెన్సీ విభాగంలో పారిశుధ్య పనుల నిర్వహణ పేరుతో ఇటీవల ఉద్యోగుల సరఫరాకు టెండర్లు నిర్వహించారు. టెండర్లలో నవనంది సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ఉద్యోగుల సరఫరా బాధ్యతలు దక్కించుకుంది. ఏజెన్సీ విభాగంలో 84 మంది పనిచేస్తున్నారు. ఆరు నెలల కాలం పూర్తయిన తర్వాత తిరిగి మరోసారి కమిషనర్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కమిషనర్ నుంచి కాల పరిమితి పొడిగింపు అనుమతి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మార్చి, ఏప్రిల్, మే నెలల వేతనాలు అందక ఏజెన్సీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఏజెన్సీ నిర్వాహకుడు సంజీవరెడ్డిని వివరణ కోరగా కమిషనర్ అనుమతి కోసం దరఖాస్తు చేశామని చెప్పారు.

సిఫారసు ఉన్నోళ్లు కీలక స్థానాల్లో..

ఏజెన్సీ సంస్థ ద్వారా మహానంది దేవస్థానంలో పని చేస్తున్న 84 మంది ఉద్యోగుల్లో చాలా మంది అధికార పార్టీ నేతల సిఫారసు నుంచి వచ్చిన వాళ్లే. వీరితో పాటు అధికారులు, ఉన్నత ఉద్యోగుల కమ్యూనిటీకి చెందిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వారి షర్టులు నలగకుండా ఉండే విధులు కేటాయిస్తున్నారు. సామాన్యులను మాత్రం రోడ్ల వెంట కసువు ఊడ్చే విధులకు, ఇతర పనులకు కేటాయిస్తుండటం విమర్శలకు తావిస్తుంది. నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి అంతర్గత బదిలీలు జరిపి, విధులు మార్చాల్సి ఉంది. కానీ ఇవేమి పట్టించుకోకుండా అధికారులు తమకు నచ్చిన వారిని ఆర్థిక వనరులున్న చోట, నచ్చని వారిని ఆలయం బయట వేస్తుండటం విమర్శలకు తావిస్తుంది. ఆలయంలో పనిచేసే ఓ ఏజెన్సీ చిరుద్యోగికి తను చేసే విధులు కాకుండా ఆలయ పెత్తనం అంతా ఇచ్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి.